డ్రైవింగ్ పేరుతో దందా



జిల్లాలో డ్రైవింగ్ స్కూళ్ల దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. కరోనా తర్వాత ప్రజలు సొంత వాహనాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఉద్యోగులు, యువత, గృహిణులు డ్రైవింగ్ నేర్చుకునేందుకు మక్కువ చూపిస్తున్నారు. దీంతో జిల్లాలో డ్రైవింగ్ స్కూల్స్ కుప్పలుగా పుట్టుకొస్తున్నాయి. ఈ క్రమంలోనే కొందరు డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు డీటీసీ కార్యాలయంలో పెత్తనం చలాయిస్తున్నారు. లైసెన్స్ పేర్లతో భారీ వసూళ్లకు తెరతీస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు రావడంతో చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

- జేబులు నింపుకుంటున్న డ్రైవింగ్ స్కూళ్ల నిర్వాహకులు
- డీటీసీ కార్యాలయంలోనూ పెత్తనం
- లైసెన్స్‌ల మంజూరుకు భారీగా వసూళ్లు
- చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధం

చిత్తూరు రూరల్: జిల్లాలో 12 డ్రైవింగ్ స్కూళ్లు ఉన్నాయి. ఈ డ్రైవింగ్ స్కూళ్లలో శిక్షణ పొందేందుకు వందల సంఖ్యలో చేరుతుంటారు. ఈ మధ్య కాలంలో మహిళలు డ్రైవింగ్ నేర్చుకునేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. దీంతో డ్రైవింగ్ నేర్చుకునేవారి సంఖ్య పెరిగింది. కొన్ని డ్రైవింగ్ స్కూళ్లు శిక్షణ కోసం వచ్చేవారిని నిలువు దోపిడీ చేస్తున్నాయి. ఎలాంటి అర్హతలు, నిబంధనలు లేకుండా శిక్షణ ఇవ్వకుండానే రూ.వేలల్లో వసూలు చేస్తున్నాయి. డ్రైవింగ్ నేర్చుకోవాలనుకునే వారి అవసరం, ఆసక్తిని అవకాశంగా మలుచుకుంటున్నాయి. ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించేస్తున్నారు. ఫలితంగా డ్రైవింగ్ రాకపోయినా వాహనాలతో రోడ్డెక్కేస్తూ రహదారి భద్రతకు సవాళ్లు విసురుతున్నారు.

రూ.వేలల్లో వసూళ్లు

ఈ తరుణంలో కొందరు డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు శిక్షణ కోసం వచ్చేవారి నుంచి కాసులు దోచుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక డ్రైవింగ్ స్కూళ్లు పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుని రెండేసి వాహనాలతో శిక్షణ ఇచ్చుకుంటున్నారు. నిర్ణీత ఫీజు వసూలు చేయడం లేదు. జిల్లా వ్యాప్తంగా సిండికేట్ అయి అందిన కాడికి దోచుకుంటున్నారు. డ్రైవింగ్ స్కూళ్ల ఫీజులు, శిక్షణ కాలం, శిక్షకుల అనుభవం తదితర అంశాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరికివారు ఇష్టం వచ్చినట్లుగా ఫీజులు వసూలు చేస్తున్నారు. 30 రోజుల శిక్షణకుగాను రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు వసూళ్లు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పైగా వారు శిక్షణకు వినియోగించే వాహనాన్ని బట్టి ఫీజులు నిర్ణయిస్తుండడం గమనార్హం. నెల రోజుల్లో పూర్తిగా నేర్పిస్తామని చెప్పినా.. మరో 2 నెలలు పొడిగించి అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారు. దీనికితోడు లెర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్సులను సైతం తామే ఇప్పిస్తామని డ్రైవింగ్ నేర్చుకునే వారి నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేసున్నారని అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇక కార్యాలయంలో అంతా తామై వ్యవహరిస్తూ డ్రైవింగ్ నేర్చుకునే వ్యక్తులను మభ్య పెడుతున్నారు. మరోవైపు తమ పలుకుబడి ఉపయోగించి కార్యాలయంలో డీఎల్ టెస్ట్ వచ్చే వారి కోసం వాహనాలు అద్దెకు ఇస్తుండడం గమనార్హం.

నిబంధనలకు తూట్లు

పాత వాహనాలకు మరమ్మతులు చేసి వాటిని శిక్షణకు ఉపయోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం పూర్తి కండీషన్‌లో ఉన్న వాహనాన్నే వినియోగించాలి. ప్రత్యేక శిక్షణ ఇచ్చే డ్రైవర్‌కు మెకానికల్ డిప్లొమా అర్హత ఉండాలి. వాహనం నేర్చుకునే వారికి ప్రత్యేకంగా తరగతులు నిర్వహించాలి. రేడియేటర్, ఇంజిను, టైర్లు చెక్ చేసుకోవడం, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాల్సి ఉంది. అనుభవం లేని డ్రైవింగ్‌తో నిత్యం వందల సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం శిక్షణ, వాహనాలు, అనుభవం కలిగిన డ్రైవర్లను ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మళ్లీ గట్టిగా వార్నింగ్ ఇస్తాం

ఇటీవలే డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులను పిలిచి గట్టిగా వార్నింగ్ ఇచ్చాం. వారిపై వస్తున్న ఫిర్యాదులను సరిదిద్దుకోవాలని మందలించాం. మళ్లీ వాళ్లకు నియమ నిబంధనలు వివరించి, గట్టిగా వార్నింగ్ ఇస్తాం. డ్రైవింగ్ నేర్చుకునే వ్యక్తులు మోస పోకండి. అధిక ఫీజులు, లైసెన్స్ ఇప్పిస్తామని చెబితే ఫిర్యాదు చేయండి. కచ్చితంగా వారిపై చర్యలు తీసుకుంటాం.

– నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

క్లుప్తంగా

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మురళీమోహన్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకోరావచ్చని పేర్కొన్నారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన జరుగుతుందని, ప్రజలు నేరుగా అధికారులకు ఫిర్యాదులు అందజేయవచ్చని పేర్కొన్నారు. అలాగే నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య స్పందన జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సాప్ – 98499 07885కు సమస్యలు తెలియచేయవచ్చని వెల్లడించారు.

19న మొదలియార్ సంఘం సమావేశం



మాట్లాడుతున్న బుల్లెట్ సురేష్

చిత్తూరు రూరల్: ఈ నెల 19వ తేదీన చిత్తూరు మురకంబట్టు వద్ద ఉన్న కలైబాల కల్యాణ మండపంలో మొదలియార్ కులస్తుల సమావేశం నిర్వహించనున్నట్టు రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ తెలిపారు. ఆయన ఆదివారం చిత్తూరు నగరం న్యూ కాయనికట్టు వీధిలో ఉన్న తమ కార్యాలయంలో మొదలియార్ కుల పెద్దలతో సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు వైఎస్సార్‌కు నివాళి

చిత్తూరు కార్పొరేషన్: ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభించి 6 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో డీసీసీబీ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. ఉదయం 9 గంటలకు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యే కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. నగరంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంలో వెళుతున్న రాజా అనే యువకుడిని ఎదురుగా వస్తున్న ఓ ప్రైవేటు అంబులెన్స్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు కాజూరు సమీపంలోని ఓ పెట్రోలు బంకు సమీపంలో బైకుపై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి. అతన్ని 108 అంబులెన్సులో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అండర్–14 క్రికెట్ సెలక్షన్స్ ప్రారంభం



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ జయప్రకాష్

పుత్తూరు రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలుర అండర్–14 క్రికెట్ సెలక్షన్స్‌ను ఆదివారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన దేశంలో క్రికెట్‌కు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని ప్రతి క్రీడాకారుడు తమ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర, జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 150 మంది క్రీడాకారుల నుంచి జిల్లా ప్రాబబుల్స్ జట్లను ఎంపిక చేశారు. వీరికి నగరిలో రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్‌ఎం సుందరం, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సురేష్, సర్పంచ్ కృపాకరన్, పీడీలు పాల్గొన్నారు.

యువకుడి మృతి

యాదమరి: మండలంలోని మోర్దానపల్లె వద్ద అమరరాజ గ్రోత్ కారిడార్‌లో ఓ కార్మికుడు ద్విచక్రవాహనంపై వస్తుండగా అదుపు తప్పి కింద పడి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. బంగారుపాళెం మండలం అడ్డవారిపల్లెకు చెందిన మోనీష్(25) అమరరాజా గ్రోత్ కారిడార్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా అమరరాజ గ్రోత్ కారిడార్ వద్ద బైక్ అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం చీలాపల్లె సీఎంసీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రహదారుల పక్కన కోళ్లవ్యర్థాలు



మొగిలి వద్ద రహదారి పక్కన పడేసిన కోళ్ల వ్యర్థాలు

- ఇబ్బంది పడుతున్న వాహనచోదకులు, ప్రజలు
- మాంసం దుకాణాల యజమానులపై చర్యలు శూన్యం
- పట్టించుకోని అధికారులు

బంగారుపాళెం : కోళ్ల వ్యర్థాలను రహదారుల పక్కన పడేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం బంగారుపాళెంలో 20 వరకు చికెన్ దుకాణాలు ఉన్నాయి. వీరు ప్రతిరోజు వ్యర్థాలను రహదారుల పక్కన పడేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. వీరిని నియంత్రించాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని జనం వాపోతున్నారు. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి, బంగారుపాళెం– అరగొండ రహదారి, బంగారుపాళెం–రాగిమానుపెంటకు వెళ్లే రోడ్ల పక్కన చికెన్ దుకాణాల నిర్వాహకులు షాపుల్లో మిగిలిపోయిన కోడి తలలు, పేగులు, ఈకలు వంటి వ్యర్థాలను చెరువులు, రహదారుల పక్కన పడేసి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నారనే మాటలు వినిపిస్తున్నాయి. అలాగే కోళ్ల వ్యర్థాలను రహదారులు, చెరువుల వద్ద పడేస్తుండడంతో అటుగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సంబంధిత పంచాయతీ అధికారులు చికెన్ దుకాణాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో చికెన్, మాంసం దుకాణాలను నిబంధనల మేర నిర్వహించాలి. కోళ్ల వ్యర్థాలను సైతం దూరంగా తీసుకెళ్లి గోతి తీసి పూడ్చిపెట్టాలి. అలా కాకుండా రోడ్ల పక్కన పడేస్తున్నారు. అదేవిధంగా చికెన్, మాంసం నాణ్యమైనది విక్రయిస్తున్నారా? లేదా ? అనే విషయాలపై కూడా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ఏ ఒక్క అధికారి కూడా మాంసం దుకాణాలను తనిఖీ చేసిన పాపాన పోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చికెన్ దుకాణాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.

కరుమారియమ్మకు ప్రత్యేక పూజలు



నింద్ర: మండల కేంద్రం నింద్రలో వెలసిన ఓంశక్తి ఆలయం వద్ద కరుమారియమ్మ దేవతకు ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేపట్టారు. స్థానిక భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

నగరిలో జోరు వర్షం



నగరిలో కురుస్తున్న వర్షం

నగరి : పట్టణ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం జోరువర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా మబ్బులు కమ్ముకుంటున్నాయి. వరుణుడు దోబూచులాడుతూ వచ్చాయి. అయితే ఆదివారం మధ్యాహ్నం మాత్రం కుండపోత వర్షం పడింది. వర్షానికి పల్లపు ప్రాంతాలు నీటితో నిండాయి. పాత నివాసాల్లో ఇదివరకు నీళ్లు ఉరవని ప్రాంతాల్లో కూడా వర్షపునీరు ఉరిసింది.

జీడీ నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం పడింది. దీంతో కాలువలు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మురుగు కాలువల్లో నీరు రోడ్లపైకి చేరింది. పలుచోట్ల భారీగా వర్షం పడడంతో పంటలకు తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఉందని పలువురు రైతులు తెలిపారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

పలమనేరు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో రైతుల సౌకర్యార్థం వీలుగా ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. తిరుమల మిల్క్ డెయిరీ సౌజన్యంతో వీటిని ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు.

ఓటరు నమోదు ప్రక్రియ తనిఖీ



చారాలలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి

తవణంపల్లి: అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని 56 పోలింగ్ కేంద్రాల్లో నూతన ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. తహసీల్దార్ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటర్ల నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. మండలంలో కొత్త ఓటర్ల నమోదుకు ఫారం–6 కింద 135 క్లెయిమ్‌లు వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా చనిపోయినవారు, గ్రామం వదిలి బయట వెళ్లినవారు ఫారం–7 కింద 365 క్లైమ్‌లు, ఓటర్ల జాబితాలో పేర్ల సవరణ కోసం ఫారం–8 కింద 61 క్లైమ్‌లు వచ్చినట్లు చెప్పారు. డిసెంబర్ 9వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. 18 ఏళ్లు వచ్చిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భూరీసర్వే డీటీ వెంకటరమణ, ఏఎస్ఓ శాంతి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, జూనియర్ అసిస్టెంట్లు హసీన్, హేమకుమార్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఆలయాలకు మహర్దశ

- గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆలయాలకు నిరాదరణ
- ప్రస్తుత ప్రభుత్వంలో ఆలయాల నవీకరణ, కొత్త ఆలయాల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నగరిలో నిర్మాణంలో ఉన్న దేశమ్మ దేవాలయం

నగరి : గత టీడీపీ పాలనలో నిరాదరణకు గురైన ఆలయాలకు ప్రస్తుతం మహర్దశ వచ్చింది. ఎండోమెంట్‌లోని ఆలయాలను నవీకరించడంతో పాటు, టీటీడీ నిధులతో కొత్త ఆలయాలు నిర్మిస్తున్నారు. ప్రాచుర్యం ఉన్న ఆలయాలను దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకు వస్తున్నారు. మంత్రి ఆర్కేరోజా చొరవతో నగరి నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి సుమారు రూ.4 కోట్లు మంజూరయ్యాయి. అలాగే కొత్త ఆలయాల నిర్మాణాలు చేపట్టారు.

రూ.1.20 కోట్లతో దేశమ్మ ఆలయ పునర్నిర్మాణం

నగరి మున్సిపాలిటీ, టీఆర్ కండ్రిగలో నేత్రదేవతగా ప్రసిద్ధి చెందిన దేశమ్మ ఆలయాన్ని రూ.1.20 కోట్లతో పునర్నిర్మిస్తున్నారు. నేత్రాలను ప్రసాదించే దేవతగా దేశమ్మ ప్రాచుర్యం పొందింది. ఇక్కడికి మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. ఆడి ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆలయ ప్రాకారం చిన్నదిగా ఉండడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని కమిటీ సభ్యులు మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో దేశమ్మ ఆలయాన్ని పునర్నిర్మించేందుకు రూ.1.20 కోట్లు మంజూరు చేయించారు. ఈ క్రమంలో గోపురం, ముఖమండపం, గర్భగుడి, పోతురాజ ఆలయం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే పొంగళ్ల షెడ్డు, వసతి గదులు, కల్యాణకట్ట, కోనేరు పనులు పూర్తయ్యాయి.

రూ.50 లక్షలతో పుత్తూరులో ఆలయాల అభివృద్ధి

పుత్తూరు పట్టణంలోని ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి ఆలయ రాజగోపురాన్ని రూ.25 లక్షలతో నిర్మించారు. అమ్మవారి గర్భగుడిని ఆధునీకరించారు. అలాగే పట్టణ నడిబొడ్డులోని పుష్కరిణి ఆధునీకీకరణకు రూ.25 లక్షలు మంజూరు చేయించారు. పుష్కరిణి ఆధునీకరించడంతో పాటు చుట్టూ గార్డెన్, స్టేజీను ఏర్పాటు చేయనున్నారు.

కాకవేడు ఆది ఆంధ్రవాడలో మాతమ్మ ఆలయ నిర్మాణం

నగరి మున్సిపాలిటీ కాకవేడు ఆది ఆంధ్రవాడలో మాతమ్మ ఆలయాన్ని నిర్మించారు. గతంలో ఆలయానికి సంబంధించిన స్థల వివాదం కోర్టులో ఉంది. దీన్ని ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరించి 10 సెంట్ల భూమిని కేటాయించింది. మంత్రి ఆర్కేరోజా చొరవతో టీటీడీ శ్రీవాణి ట్రస్టు నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. దీంతో నూతన ఆలయం నిర్మించారు.

విజయపురం ఎస్టీ కాలనీలో పెదపాళెమ్మ ఆలయం

విజయపురం ఎస్టీ కాలనీలో పెదపళ్లెమ్మకు తడికలతో కట్టిన చిన్న ఆలయం మాత్రమే ఉండేది. నాలుగు దశాబ్దాలుగా అందులోనే పూజలు చేస్తున్నారు. పక్కా ఆలయాన్ని నిర్మించాలన్న కోరిక కలగానే మిగిలింది. మూడేళ్ల క్రితం మంత్రి ఆర్కేరోజా టీటీడీ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయించగా ఆలయం నిర్మించారు.

ముడిపల్లి దళితవాడలో రాధారుక్మిణి సమేత శ్రీకృష్ణ ఆలయం

మండలంలోని ముడిపల్లి దళితవాడలో శిథిలావస్థకు చేరుకున్న రాధారుక్మిణి సమేత శ్రీకృష్ణ ఆలయాన్ని పునర్నిర్మించుకోవాలన్న స్థానికుల దశాబ్దాల కోరిక మంత్రి రోజా చొరవతో నెరవేరింది. ఆలయ నిర్మాణానికి టీటీడీ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

ఆలయాలకు మరిన్ని సేవలు

- అర్జునప్ప కండ్రిగలో రూ.7.5 లక్షలు మంజూరు చేయించి కనకదుర్గమ్మ ఆలయాన్ని ఆధునీకరణ చేస్తున్నారు.
- బుగ్గఅగ్రహారంలో వన్నూరమ్మ ఆలయాన్ని దేవాదాయశాఖ పరిధిలోకి చేర్చడం. ఏఏడబ్ల్యూలోని మాతమ్మ ఆలయానికి రాతి, పంచలోహ విగ్రహాలు, రేడియో సెట్ ఇప్పించడం.
- సత్రవాడ కరివరదరాజ ఆలయానికి టీటీడీ పర్యాటక బస్సు వెళ్లే ఏర్పాటుచేయడం.
- కరకంతాపురంలోని రామాలయానికి రామ, లక్ష్మణ, సీతా, హనుమంత పంచలోహ విగ్రహాలు టీటీడీ ద్వారా అందజేయడం.
- నగరి కరకంతేశ్వర స్వామి, పుత్తూరు సదాశివేశ్వర స్వామి ఆలయాలకు రూ.4 లక్షలతో నంది వాహనాలు అందజేశారు.

రూ.1.70 కోట్లతో నింద్ర ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి

నింద్రలో చారిత్రక విశిష్టిత కలిగిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని రూ.1.70 కోట్లతో పునర్నిర్మిస్తున్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన ఈ ఆలయంలో నాలుగు దశాబ్దాల క్రితం వరకు నిత్య పూజలు జరిగేవి. ఆలయంలో జరిగిన తవ్వకాల్లో అప్పట్లో 5 పంచలోహ విగ్రహాలు బయటపడగా వాటిని అధికారులు ట్రెజరీకి తరలించారు. ఒక పెద్ద రాతి విగ్రహం బయటపడగా పురావస్తు శాఖ చెన్నై మ్యూజియంకు తరలించింది. ఊరి మధ్యలో ఉన్న ఇంతటి ప్రసిద్ధి చెందిన ఆలయం అభివృద్ధికి నోచుకోకపోవడంతో శిథిలావస్థకు గురైంది. దీనికి పూర్వ వైభవం తీసుకురావాలన్న స్థానికుల కోరిక మేరకు మంత్రి ఆర్కేరోజా రూ.1.70 కోట్లు మంజూరు చేయించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం



సురేష్‌బాబు



లీలావతి

ఐరాల: యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) మండల నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద నిర్వహించారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు, ఎన్నికల పరిశీలకుడిగా యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి వ్యవహరించారు. మండల శాఖ అధ్యక్షుడిగా ఎం.సురేష్‌బాబు, గౌరవాధ్యక్షుడిగా కే.ప్రభాకర్, అసోసియేట్ అధ్యక్షులుగా అరుణ్‌కుమార్, అమ్ములు ఎన్నికయ్యారు. అలాగే యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శిగా ఎం.లీలావతి, కోశాధికారిగా దేవరాజులు, మండల కార్యదర్శులుగా గుణసుందరి, నాగరాజు, కేశవులు, జ్యోతి, సుబ్రమణ్యం, రోజారాణి, ప్రదీప్, పురంధరచౌదరి, రవి, సుధాకర్, త్రివేణి, జనార్ధన్, రోజారాణిని ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కౌన్సిలర్లుగా, ఆడిట్ కమిటీ సభ్యులుగా పలువురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు చెప్పారు.

గణిత ప్రజ్ఞాధారణలో విద్యార్థుల ప్రతిభ



గణితంలో ప్రతిభ చాటి సర్టిఫికెట్లు అందుకున్న మంగళపల్లి జెడ్పీ హైస్కూలువిద్యార్థులు

కుప్పం: మానవ కంప్యూటర్‌గా పేరొందిన శకుంతలాదేవి జయంతి పురస్కరించుకుని ద్రవిడ విశ్వవిద్యాలయంలో ఆదివారం గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్సిటీ మ్యాథమాటిక్స్, స్టాటిస్టిక్స్ విభాగాలు, జనవిజ్ఞాన వేదిక, ఏపీ మ్యాథ్స్ ఫోరం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. బంగారుపాళ్యం మండలం మంగళపల్లి జెడ్పీ హైస్కూలు విద్యార్థులు హేమ, లహరి, రేవతి, పునిత్ సాయి గణితంలో తమ అసాధారణ ప్రతిభను చాటారు. వంద రెండెంకల సంఖ్యలను విని వాటిని మొదటి నుంచి చివరి వరకు, అలాగే వెనుక నుంచి ముందుకు తెలియజేయడం, ఆ రెండు వందల సంఖ్యను 5తో, 25తో గుణించి వాటి ఫలితాన్ని తెలిజేయడం వర్సిటీ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. వారిని అభినందించారు. విద్యార్థులకు వర్సిటీ అధికారులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

పచ్చదనం పెంపుతో పర్యావరణ రక్షణ



ఉచితంగా ఫలసాయ మొక్కలను అందిస్తున్న సంకల్పతరు ఫౌండేషన్ సభ్యులు

కార్వేటినగరం: పచ్చదనం పెంపుతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సంకల్పతరు గ్రీన్‌డెక్కన్ కోఆర్డినేటర్ వీరకంతేశ్వర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కేశవకుప్పం వద్ద వ్యవసాయ పొలంలో దానిమ్మ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతులకు కార్పొరేట్ బాధ్యత కింద ఎస్ బ్యాంకు ఆర్థిక సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఉద్యానవన మొక్కలు నాటేందుకు ముందుకొస్తే ఉచితంగా ఫలసాయ మొక్కలను పంపిణీ చేస్తామని చెప్పారు. అనంతరం తిరుపతి క్లస్టర్ ఎస్ బ్యాంకు మేనేజర్లు రవిశంకర్, ధనంజయులు మాట్లాడుతూ 20 ఏళ్ల వరకు ఎస్ బ్యాంకు ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులు కేశవరాజు, రవిరాజు, లక్ష్మణరాజు, సతీష్, సదాశివమండడి, పర్వేజ్, రఘు, గణేష్ పలువురు పాల్గొన్నారు.

'భగవద్గీత పారాయణం చేస్తే ఆత్మ జ్ఞానం'



పలమనేరు : త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేస్తున్న సభ్యులు

కుప్పం రూరల్: ప్రబోధానంద విరచిత త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలపై మండలంలోని క్రిష్ణదాసనపల్లె, యానాదిపల్లె గ్రామాల్లో ప్రబోధానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మ ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. ఇందులో మధ్యదైన ఆత్మను ఆరాధించడం వల్ల ధర్మస్థాపన జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణం చేయాలని, ఇది జ్ఞానం, శాంతి స్థాపనకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రబోధానంద సేవా సమితి సభ్యులు నాగరాజు, కృష్ణ, శివకృష్ణ, చరణ్, ఇందిర, లక్ష్మి, రాధ పాల్గొన్నారు.

పలమనేరు మండలంలో..

పలమనేరు: మండలంలోని సముద్రపల్లెలో త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను స్థానిక ప్రబోధ సేవా సమితి నిర్వాహకులు ఆదివారం పంపిణీ చేశారు. గీతలోని అన్ని విషయాలు మానవ జీవితం సరైన వెళ్లడానికి మార్గం చూపుతాయన్నారు. కార్యక్రమంలో భాస్కర్, బాలాజీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



గ్రూపు ఫొటో దిగుతున్న పూర్వ విద్యార్థులు

తవణంపల్లె: మండలకేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్లో 1984–85 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం 37 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. దీంతో స్కూల్ అంతా పండుగ వాతావరణం నెలకొంది. అందరూ కలసి సంతోషంగా గడిపారు. ఒకరికి ఒకరు యోగ క్షేమాలు తెలుసుకున్నారు. నాటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన వారి మిత్రులను, గురువులను స్మరించుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురువులకు పాదపూజ చేసి శాలువలు, పూలదండలతో ఘనంగా సత్కరించి గురుభక్తి చాటుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో సంతోషంగా గడిపారు.